
కథ

# ఉగాది కానుక

ఉగాది పండుగ దగ్గర పడు తోందని గుర్తొస్తే చాలు. ఒళ్లంతా గిలిగింతలు పెట్టినట్లు, పులకింత లు చెలరేగినట్లు ఉంది రంబాబుకి. పండుగ వస్తోందీ అంటే చాలా మంది కొత్త అల్లుళ్ళకి ఆలాగే ఉంటుందేమో గానీ అతడిలో మాత్రం ఆనందం పరవళ్లు తొక్కు తోంది. పైగా అతడే మన్నా కొత్త అల్లుడా? ఊహూఁ కానే కాదు.



— కొండా కుసుమ కుమారి

కారం రాచుకొన్నట్లనిపిస్తుంది.

ఇక మామగారైతే "నీకు బొత్తిగా తోచనట్టుంది రాంబాబూ! వీడియో కాసెట్లు తీసుకురారాదూ!" అంటూ పురమాయించి టీవీకి అతుక్కుపోయి కూతురు అందించే ఫలహారాలు తీరుబడిగా తింటూ కాలక్షేపం చేస్తుంటే ఒళ్లు మండి పోతోంది.

ఎయిర్‌కూలర్ వచ్చే దాకా ఓపిక పట్టక తప్పదనుకొని పండుగ రోజంతా పడిగాపులు పడ్డాడు మామగారి నోటి నుంచి ఆ మాటొస్తుందేమోనని.

కాని ఆయన గారికి ఆ ధ్యాసే ఉన్నట్లు కనిపించలేదు.

భార్యకు పిండి వంటలు పురమాయించటం. అల్లుడితో కొత్త సినిమా కాసెట్లు తెప్పించుకోవటం మాత్రమే జీవిత ధ్యేయం అన్నట్లున్నాడు. అప్పటికీ ఆ విషయం రమ్యకు గుర్తు చేశాడు.

"మీ కింత తొందరే" అంటూ విసుక్కొంది.

ఆ రాత్రి సరిగా నిద్రే పట్టలేదు రాంబాబుకి.

★ ★ ★

పొద్దుటే ఎవరో పిలవడంతో షేవ్ చేసుకొంటున్నవాడల్లా లెచొచ్చాడు.

అపరిచిత వ్యక్తులు ఇద్దరూ లోపలకు చూస్తూ "జగన్నాథం గారున్నారా" అంటూ అడిగారు.

"ఉన్నారు. మీరెవరండీ!"

"ఇన్‌స్టాల్‌మెంటులో ఇంటికి కావలసిన వస్తువులన్నీ సప్లయి చేసే షావువాళ్లం" సీరియస్‌గా అన్నాడు వాళ్లల్లో ఒకడు.

ఎగిరి గంతేసినంత పని చేశాడు రాంబాబు.

ఆనందంతో తలమునకలవుతూ "రండి - రండి" అంటూ ఆహ్వానించాడు వాళ్లను.

మొత్తానికి భలే మామగారు. మాట మాత్రం చెప్పకుండా గొప్ప సస్పెన్సులో పెట్టేశాడు. చివరకు ఇలా ఇన్‌స్టాల్‌మెంటులో పండుగ కానుక సెటిలు చేశాడన్న మాట అనుకొంటూ హుషారుగా లోపల కొచ్చాడు.

అప్పటికే వంటింట్లో తలుపు చాటు నుండి పొంచి చూస్తున్నాడు జగన్నాథం.

"మామగారూ! మీ కోసం ఇన్‌స్టాల్‌మెంటు షావు వాళ్లు వచ్చారు. ఏదైనా కావాలని చెప్పారా?" ఏమీ తెలియనట్లు గాంభీర్యం ప్రదర్శించాడు.

"అబ్బే! వాళ్ళకి నేనేం చెప్పలేదు బాబూ! అసలు నేను ఇంట్లో లేనని చెప్పి పంపించెయ్ నాయనా! అన్నాడు.

అదిరిరి పడ్డాడు. "అదేమిటండీ! వాళ్లంతగా మీ కోసం వస్తే లేరని చెప్పమంటారేమిటి!"

"ఫరవాలేదు బాబూ! ముందు నేను ఇంట్లో లేనని చెప్పి పంపించెయ్!" రాంబాబు మామగారిని అయోమయంగా చూశాడు.

"అదేమిటండీ! మీ రింట్లో ఉన్నారని చెప్పాను. ఇప్పుడే పెరటి దారంట మార్కెట్టు కెళ్లారని చెప్పుబాబూ!" కంగారుగా అన్నాడు.

"బావుండదండీ! మీరొచ్చి అదేదో సెటిలు చేస్తే బావుంటుంది"

"నా వల్ల కాదు నాయనా! ముందు వాళ్లని పంపించేస్తే మంచిది."

రాంబాబుకి మామగారి ఆలోచన అర్థం అవటంతో పట్టుదల పెరిగింది. ఎలాగైనా ఎయిర్‌కూలర్ రాబట్టుకొని కాని వదిలి పెట్టకూడదనుకొన్నాడు.



తెలీదా?

"ఏంటలా అడవిలో చెట్లు నరుకుతున్నావ్? అదే మన్నా నీ బాబు సొమ్ము అనుకొన్నావా?" అని ప్రశ్నించాడు.

"వన సంపద మన సంపద" అనే కాప్షన్ తెలీదా మీకు?" అని బదిలిచ్చాడు.

శ్రీగిరి శ్రీకాంత్,
[అమలాపురం]

'ఇన్‌స్టాలుమెంటని మీరేం ఇదవ్వకండి మామగారూ! మనలాంటి మధ్య తరగతి వాళ్లకు సులభవాయిదాల పద్దతే మంచిది. అత్తయ్యా! మీరైనా చెప్పండి.

అన్నపూర్ణమ్మ చేతులు పిసుక్కొంటూ "తర్వాత చూద్దాంలే బాబూ! ముందు వాళ్లను పంపించెయ్" అంది.

రమ్య ఉండబట్టలేక భర్తతో "మీరేమిటండీ మధ్యలో. వాళ్ళకి నేను చెబుతాను వదండి. బలవంతంగా వస్తువులు అంటగట్టడ మేమిటి. వాళ్లకి బుద్ధుండక్కర్లా" అంటూ హాల్లోకి వెళ్లబోతుంటే రాంబాబు పట్టుకొని ఆపాడు.

"ఇంటి కొచ్చిన పెద్దమనుష్యులతో అలా మాట్లాడితేఏం బావుంటుంది. మేం వెళతాంలే" అంటూ రాని మొరాయిస్తున్నా వినకుండా మామగారి చెయ్యి పట్టుకొని లాక్కుపోయినంతపని చేశాడు.

జగన్నాథాన్ని చూస్తూనే ఒక్కసారిగా వాళ్లిద్దరూ దూకుడుగా లేచారు.

"ఏమిటయ్యా పెద్దమనిషీ! చెప్పా పెట్టకుండా ఊళ్లో నుండి ఉడాయించటం మర్యాదేనా!"

బిత్తర పోయారు రమ్యా రాంబాబు.

జగన్నాథం తడబడుతూ "నేను వచ్చి మీ ఓనరుతో మాట్లాడుతాను. వెళ్లండి బాబూ! ఏదో పండగని అల్లుడి గారి దగ్గర కొచ్చాంకాని మేమక్కడకు వెళతాం అన్నాడు.

"చాల్లేవయ్యా! ఇంట్లో చిన్నా చితకా సామానంత అమ్మేసుకొని ఇల్లు ఖాళీ చేసి రాత్రికి రాత్రికి బయలుదేరి వచ్చేశారు. ఇటునుంచి ఏ తీర్థయాత్రలకో వెళ్లాలని ఊరొదలి పెట్టారట. ఏడాదిగా ఇదిగో కడతా, అదిగో కడతా అంటూ మాటలతో మరిపించి చివరకు ఈ పని చేస్తావా? బుద్ధుండాలయ్యా ముందు మాకు డబ్బయినా కట్టు. తీసుకొన్న సామానైనా అప్పగించులేకపోతే ఊరుకొనేది లేదు.

బెదిరిపోయాడు రాంబాబు. నిర్ఘాంతపోయింది రమ్య.

"అవన్నీ ఆయన దగ్గరరెందుకుంటాయి. పండగ కానుకలుగా అల్లుడి కిచ్చేస్తేనూ!" అన్నపూర్ణమ్మ కలుగజేసుకొంది.

"అహా! అయితే ఈ కలరు టీవీ, ఫ్రిజ్జూ డైనింగు టేబిలు సెట్టూ అన్నీ మావేనన్న మాట. ఒరేయ్ నాగూ! ముందు ఏదైనా బండి మాట్లాడరా! ఈయన గారు ఇచ్చేదేం లేదు కాని మన వస్తువులైనా పట్టుకుపోదాం. అత్త సొమ్ము అల్లుడు ధారపోసాడంటే ఇదే"

రాంబాబు గుండె గుభిల్లుమంది.

"ఇప్పుడు ఇవన్నీ మాకు సంబంధించినవైతే ఎలా తీసుకెళతారు?"

"అలాగా నాయనా! అయితే వాటి రసీదులు చూపించు" దిక్కులు చూశాడు.

"పోనీ వాయిదాలు మీరు చెల్లిస్తానంటే వెళ్లిపోతాం" చివరగా అన్నాడు.

కంగారు పడ్డాడు. "అబ్బే నే నెందుకు కడతాను"

"మరి అప్పనంగా తెచ్చుకొని ఇంట్లో పెట్టుకోవటం అనుకొన్నావా? జగన్నాథం బ్రతిమాలాడుతున్నా వినకుండా అందరూ కళ్లప్పగించి చూస్తుండగానే ఒక్కొక్కటిగా అన్నీ తీసుకెళ్లిపోయారు.

క్షణాల్లో ఇల్లంతా బావురుమన్నట్లయింది.

"క్షమించు నాయనా! నా ఒక్కగా నొక్క కూతురు దేనికీ కంటతడి పెట్టకూడదని మీ సంసారం కళ కళలాడాలని కోరినవన్నీ ఈ పద్ధతిలో తెచ్చాను. నా జీతంలోనే తినీ తినకా వాయిదాలు కట్టుకొంటూ వస్తుంటే పోయిన ఏడాది చూపుతగ్గిందని షాపులో గుమాస్తా ఉద్యోగం నుంచి తీసేశారు. మళ్లీ ఎన్ని ప్రయత్నాలు చేసినా ఏ చిన్న ఉద్యోగమూ దొరికింది కాదు. రాను రాను పిడికెడు మెతుకులు వండుకోవటం కూడా కష్టమైపోయింది. ఇక మా శేష జీవితాన్ని ఏ ఆశ్రమంలోనో గడపాలని నిర్ణయించుకొని, చివరగా మిమ్మల్నిచూసి మీ దగ్గర నాలుగు రోజులు ఉండాలని ఇక్కడ కొస్తే ఇంత ఘోరం జరిగింది. తిన్నగా ఎటైనా వెళ్లిపోయినా బావుండుననిపిస్తుందిప్పుడు" అనాడు ఖిన్నుడై.

రమ్య కళ్లనీళ్లుపెట్టుకొంది "మా కోసం ఎందు కింత పని చేశారు నాన్నా అడిగినవన్నీ కొనివ్వకపోతే కాని వదిలిపెట్టని కసాయి వాళ్లమా మేము?"

"అలా అని కాదు తల్లీ! ఈ దేశంలో ఏ ఆడపిల్లా నిలువునా తగలబడిపోతున్నా ఇంకా తన భర్త మంచివాడే అని చెబుతుంది కాని అతడి అసలు నైజాన్ని లోకానికి చూపే ప్రయత్నం చెయ్యదు కదా. అందుకే మా భయం మాది. ఇక మేం మాత్రం ఎందుకిక్కడ. మా దారిన మమ్మల్ని వెళ్లనీ!"

రాంబాబు తలగిర్రున తిరిగిపోతోంది.

పండుగ కానుక లంటూ మురిసిపోయాడే కాని ఈ వృద్ధులు తమ జీవితాన్ని పణంగా పెట్టి తమను తాము బలి ఇచ్చుకొంటారని వూహించనందుకు సిగ్గు పడ్డాడు.

"మీ కొడుకైనా కూతురయినా రమ్యే కదా! ఇంకెక్కడకు వెళతారు. ఎప్పుడో మీరిచ్చిన కానుకలు అందుకోవటమే కాని మేమీదీ మీకు ఇవ్వలేదు కదా! అందుకే ఈ ఉగాది పండక్కి మేమిచ్చే కానుక ఇదే అనుకోండి మామగారు, ఇక్కడే ఉండండి" అంటూ లోపలకు వెళ్లిపోయాడు. ఇప్పుడు తమ మనసెంతో తేలిగ్గా, హాయిగా అనిపించింది. పండుగ కానుకలు తీసుకొన్నప్పుడు కూడా ఇంత ఆనందం కలుగనందుకు ఆశ్చర్యం కూడా వేసింది.

●